EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
01-12-2025
పేజీలు: 02




# రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్



కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు ఖమ్మం కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్యే నిదర్శనమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. వీరన్న బలవన్మరణం అత్యంత బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు ఇంది నిదర్శనమని చెప్పారు. వీరన్నది ఆత్మహత్య కాదని, ప్రభుత్వం చేసిన హత్య అని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక బతుకులు భారమైన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వెల్లడించారు. కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామని బాండ్లు రాసిచ్చారని, అధికారంలోకి వచ్చాక రైతులను మోసం చేయడం దుర్మార్గమని ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తామని చెప్పి, నేడు వారి బతుకులకు భరోసా లేకుండా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో కౌలు రైతు బానోతు వీరన్న ఆత్మహత్య అత్యంత బాధాకరం. పురుగుల మందు తాగుతూ.. పండించిన పంటకు ధర రాక, అప్పులు తీర్చే దారిలేక చనిపోతున్నా అని వీరన్న తీసుకున్న సెల్ఫీ వీడియో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతాంగానికి చేసిన మోసాలకు నిదర్శనం. వీరన్నది ఆత్మహత్య కాదు, ప్రభుత్వం చేసిన హత్యనే. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయని ఫలితంగా బతుకులు భారమై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందు కౌలు రైతులకు ఏడాదికి రూ.15,000 రైతుభరోసా ఇస్తామని బాండ్లు రాసిచ్చి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేయడం దుర్మార్గం. పండించిన పంటను కొనే దిక్కులేక, మద్దతు ధర రాక, దళారుల దోపిడీకి రైతులు బలవుతున్నారు. సెల్ఫీ వీడియోలో వీరన్న చెప్పిన మాటలకైనా ఈ ప్రభుత్వానికి చలనం వస్తుందా? ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారు? మీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకెంత మంది రైతులను బలి తీసుకుంటారు? రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లా పర్యటనలో కౌలు రైతు బానోతు వీరన్న కుటుంబాన్ని పరామర్శించాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. రైతులెవరూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడవద్దని చేతులు జోడించి విన్నవిస్తున్నాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం చేద్దాం.. మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది.

## ప్రేమ జంటను కలిపిన సర్పంచ్ ఎన్నికలు



ఎన్నికల పుణ్యమా అంటూ ప్రేమికులిద్దరూ ఒక్కటయ్యారు.. ఎన్నికలు ఏంటి.. పెళ్లేంటి అనుకుంటున్నారా.. గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న ఆలోచనతో రిజర్వేషన్ తనకు అనుకూలించక పోవడంతో తను ప్రేమిస్తున్న అమ్మాయిని బరిలోకి నిలిపాడు ఒక యువకుడు.. షాకులు, మలుపులు.. సర్పంచ్ ఎన్నికల్లో కామన్. కానీ ఇలాంటి సీన్ మాత్రం నెవ్వర్ బిఫోర్.. ఎవ్వర్ ఆఫ్టర్. సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి గ్రామ సర్పంచ్ పదవి ఎస్సీకి రిజర్వ్ అయింది. ఈ విషయం తెలియగానే ఎగిరి గంతేశాడు చంద్రశేఖర్ అనే యువకుడు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన శ్రీజ అనే యువతిని ప్రేమించిన చంద్రశేఖర్ గౌడ్ ఆమెతో మధ్యాహ్నం నామినేషన్ వేయించాడు. కూతురు నామినేషన్ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు నామినేషన్ ఉపసంహరించుకోవాలని శ్రీజపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆమె రాత్రి యాదగిరి గుట్టకు వెళ్లి చంద్రశేఖర్ ను పెళ్లి చేసుకున్నారు.తమ కూతురు కనిపించడం లేదని సంగారెడ్డి రూరల్ పోలీసులకు కంప్లయింట్ చేశారు శ్రీజ తల్లిందండ్రులు. చంద్రశేఖర్ కిడ్నాప్ చేశారని ఆరోపించారు. అయితే తాను కిడ్నాప్ కాలేదని ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నానని ప్రకటించింది శ్రీజ. తాను మేజర్‌ను అని ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నాని పోలీసులకు తెలిపింది. ఇంతలో ఈ ఎపిసోడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు బీఆర్ఎస్ నేతలు.. శ్రీజకు మద్దతుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నేతలు. ఇక సర్పంచ్ పదవికి నామినేషన్ వేసిన శ్రీజ తన భర్త సహకారంతో గెలుస్తానంటోంది. చంద్రశేఖర్ కూడా తన భార్యను గెలిపించుకుంటానంటున్నాడు.

## విషమంగానే బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఆరోగ్యం



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) చైర్‌పర్సన్ ఖలీదా జియా ఆరోగ్యం క్షీణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే, ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు పార్టీ సీనియర్ నేత ఒకరు తాజాగా తెలిపారు. ఖలీదాను సీసీయూ యూనిట్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. 80 ఏండ్ల ఖలీదా నవంబర్ 23న అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఛాతీ ఇన్ఫెక్షన్‌తో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా ఆమె గుండె, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం పడింది. అప్పటి నుంచి ఆమె ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఇప్పటికీ ఆమె ఆరోగ్యం విషమంగానే ఉందని పార్టీ నేతలు వెల్లడించారు. కాగా, 2018లో అవినీతి కేసులో ఖలీదాకు అప్పటి ప్రభుత్వం 17 ఏళ్ల జైలుశిక్ష విధించిన విషయం తెలిసిందే. అయితే, ఇటీవలే విద్యార్థుల ఉద్యమంతో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోవడంతో.. అవినీతి కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖలీదా జియాను అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ కార్యనిర్వాహక ఉత్తర్వులతో విడుదల చేశారు. అంతకుముందు, లండన్‌లో నాలుగు నెలల పాటు వైద్య చికిత్స తీసుకుని ఆమె ఈ ఏడాది మే నెలలోనే ఢాకాకు తిరిగి వచ్చారు. ఇప్పుడు మరోసారి ఆమె ఆరోగ్యం మరోసారి క్షీణించింది. దీంతో పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



## కర్ణాటక రోడ్డు ప్రమాదంలో ఏపీ దంపతులు మృతి

కర్ణాటక రోడ్డు ప్రమాదంలో శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన దంపతులు దుర్మరణం చెందారు. బెంగళూరు వెళ్తుండగా మధుగిరి వద్ద కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. దీంతో తీవ్ర గాయాలపాలైన దంపతులు కృష్ణారెడ్డి, జ్యోతిక అక్కడికక్కడే చనిపోయారు. మృతులు మడకశిర మండలానికి చెందిన దంపతులుగా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.




## ఇండోనేషియాలో 442కు చేరిన మృతుల సంఖ్య

సెనార్ తుఫాన్‌తో ఇండోనేషియా అతలాకుతలమైంది. ఆ తుఫాన్ వల్ల సుమారు 442 మంది మరణించారు. భారీ వరదలు పెను నష్టాన్ని కలిగించాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. థాయ్‌ల్యాండ్, మలేషియాలో కూడా విధ్వంసం జరిగింది. థాయ్‌లో సుమారు 170 మంది మరణించారు. సైనార్ తుఫాన్‌తో దెబ్బతిన్న ఇండోనేషియాలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. సుమత్ర దీవుల్లో నష్టం భారీగా ఉన్నది. వేలాది మందికి ఆహారం అందడం లేదు. కొన్ని చోట్ల వరదల వల్ల బిల్డింగ్, ఇండ్లు కొట్టుకుపోయాయి. ఫిలిప్పీన్స్, శ్రీలంకతో పాటు దక్షిణాసియా దేశాల్లో వచ్చిన తుఫాన్ల వల్ల ఈ నెలలోనే 900 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది.



## గ్యాస్ సిలిండర్ ధరల్లో భారీ మార్పులు

డిసెంబర్ 1 వచ్చేసింది. దేశవ్యాప్తంగా ఈ రోజు నుంచి అనేక మార్పులు చోటుచేసుకోనున్నాయి. గ్యాస్ ధరలు, బ్యాంకింగ్స్‌తో పాటు ప్రజలను ప్రభావితం చేసే పలు మార్పులు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రతీ నెలా 1వ తేదీ వచ్చిందంటే.. గ్యాస్ ధరలు ఖచ్చితంగా మారుతూ ఉంటాయి. ఆయిల్ కంపెనీలు కొత్త గ్యాస్ ధరలను ప్రకటిస్తూ ఉంటాయి. దీంతో ప్రతీ నెలా ఒకటో తేదీ వచ్చిందంటే సామన్యులు, హోటల్ యజమానులు గ్యాస్ ధరల గురించి తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తారు. గ్యాస్ ధరల్లో కొంచెం మార్పు చేసుకున్నా.. సామాన్యులపై ఎక్కువ ప్రభావితం చూపుతుంది. అందుకే గ్యాస్ ధరలపై ఎప్పుడూ అందరి దృష్టి ఉంటుంది. ఇవాళ ఆయిల్ కంపెనీలు గ్యాస్ ధరలు ప్రకటించాయి. ఏం మార్పులు చోటుచేసుకున్నాయో ఇప్పుడు చూద్దాం. కమర్షియల్ పనుల కోసం ఉపయోగించే వాణిజ్య సిలిండర్ ధర కాస్త తగ్గింది. 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ.10 తగ్గించాయి. నవంబర్ నెలలో రూ.5 తగ్గించగా.. అక్టోబర్‌లో రూ.12.50 పెరిగింది. అంతకుముందు ఆరు నెలలు ధరలు తగ్గాయి. గత కొద్ది నెలలుగా వాణిజ్య సిలిండర్ ధరలు తగ్గుతుండగా.. దీని వల్ల హోటల్, క్యాటరింగ్ వ్యాపారులకు ఊరట కలుగుతోంది. ఈ తగ్గింపుతో ప్రస్తుతం ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1580.50గా ఉంది. దీనికి ముందు దాని ధర రూ.1590గా ఉంది.



## ఏపీలో కొత్త పురుగు వ్యాధి కలకలం

స్క్రబ్ టైఫస్ అనే కీటకం కుట్టడంతో అనారోగ్యానికి గురయ్యి విజయనగరం ప్రాంతానికి చెందిన మహిళ మృతి. ఏపీలో 1317 స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం మిట్టపల్లి గ్రామంలో గత కొంతకాలంగా జ్వరంతో బాధపడుతున్న రాజేశ్వరి(36) అనే మహిళ, ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా, స్క్రబ్ టైఫస్ సోకిందని నిర్ధారించిన వైద్యులు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన రాజేశ్వరి. ఈ స్క్రబ్ టైఫస్ వ్యాధి రాష్ట్రంలో అన్ని జిల్లాలో వ్యాపిస్తుండటంతో భయాందోళనకు గురవుతున్న ప్రజలు. చిత్తూరులో 379, కాకినాడలో 141, విశాఖపట్నంలో 123, వైఎస్సార్ కడపలో 94, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరులో 86, అనంతపురంలో 68, తిరుపతిలో 64, విజయనగరంలో 59, కర్నూలులో 42, అనకాపల్లిలో 41, శ్రీకాకుళంలో 34, అన్నమయ్యలో 32, గుంటూరులో 31, నంద్యాలలో 30 కేసులు నమోదైనట్లు తెలిపిన వైద్య శాఖ వ్యాధి నిర్ధారణ జరిగితే సాధారణ యాంటిబయాటిక్స్ తో ఈ వ్యాధి నయం అవుతుందని, అస్వస్థతకు గురవ్వగానే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్న అధికారులు.




## ఐటీ ఉద్యోగుల్లో హెచ్ఐవీ పెరుగుదల: షాకింగ్ నివేదిక

జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నివేదిక ప్రకారం, ఐటీ రంగ ఉద్యోగుల్లో హెచ్ఐవీ కేసులు పెరుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఈ సంక్రమణ శాతం పెరుగుతోందని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాల ఎయిడ్స్ నియంత్రణ సొసైటీలకు సూచించారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే హెచ్ఐవీ సంక్రమణ రేటు 0.44 నుంచి 0.41కు తగ్గినప్పటికీ, ఐటీ రంగంలో పెరుగుదలకు విదేశీ జీవనశైలి, వీకెండ్ పార్టీలు, అరక్షిత శృంగారం, డ్రగ్స్, మద్యం వంటివి కారణాలుగా చెబుతున్నారు. తక్షణ గర్భనిరోధక మాత్రల లభ్యత కూడా అరక్షిత శృంగారాన్ని పెంచిందని నివేదిక పేర్కొంది.



## ఇతరుల కోసం అస్సలు బతకొద్దు

నేషనల్ క్రష్ రష్మిక మందన్న రౌడీ హీరో విజయ్ దేవరకొండల మధ్య ఎంగెజ్ మెంట్ జరిగింది.ఈ క్రమంలో కొద్ది మంది సన్నిహితుల మధ్య వేడుక గ్రాండ్ గా నిర్వహించారని సమాచారం. మరోవైపు పుట్టపర్తికి విజయ్ వెళ్లినప్పుడు ఆయన చేతికి రింగ్ కూడా కన్పించింది. ఇది పక్కా నిశ్చితార్థం రింగ్ అని ప్రచారం జరిగింది. మరోవైపు పుట్టపర్తి నుంచి తిరిగి వస్తుండగా విజయ్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు ప్రమాదంకు గురైంది. కొంత మంది రష్మికను ఎంగెజ్ మెంట్ చేసుకొవడం వల్లనే గండం తప్పిందని చెప్తుంటే, మరికొంత మంది మాత్రం రష్మిక వల్ల విజయ్ కు ప్రమాదం ఉందని కూడా లేని పోనీ రూమర్స్ వైరల్ చేశారు. అదే విధంగా ఇటీవల కాంతారా మూవీ విషయంలో రష్మిక చేసిన వ్యాఖ్యలతో కన్నడ ఇండస్ట్రీ రష్మిక మూవీస్ ను బ్యాన్ చేశారని నెట్టింట వార్తలు తెగ హల్ చల్ చేశాయి.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM




## శ్రీశైలంలో ఉచిత లడ్డూ సేవ ప్రారంభం

శ్రీశైలం మల్లికార్జున స్వామివారి దేవస్థానంలో సోమవారం నుంచి భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం అందజేయడం ప్రారంభం కానుంది. అతిశీఘ్ర దర్శనం టికెట్ (రూ. 300) తీసుకున్న వారికి ఒక లడ్డూ, స్వామివారి స్పర్శ దర్శనం (రూ. 500) టికెట్ దారులకు రెండు లడ్డూలు ఉచితంగా ఇస్తారు. అదనంగా డొనేషన్ కౌంటర్, ఛైర్మన్ ఛాంబర్, కైలాస కంకణాల కేంద్రం ప్రారంభం చేయడంతో పాటు శ్రీగోకులం ఆధునికీకరణ పనులకు భూమి పూజ నిర్వహించనున్నారు.



## ఆటో బోల్తా.. ఇద్దరు మృతి, 15 మందికి గాయాలు

ఏపీలోని అల్లూరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. అంగళూరు వద్ద గండిపోచమ్మ ఆలయానికి వెళ్లి వస్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా, పాలకొల్లుకు చెందిన 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి నిమ్మల రామ్మోహన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

### తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టు..

# త్వరలోనే విమాన సర్వీసులు ప్రారంభం




తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టు అందుబాటులో రానుంది. మామునూరు విమానాశ్రయం నిర్మాణంపైనా కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. శనివారం ఆయన వరంగల్ జిల్లా అయోధ్యపురం వద్ద రూ.521 కోట్లతో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ నిర్మిస్తున్న కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులను దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడిన ఆయన.. మామునూరు విమానాశ్రయం నిర్మాణ పనులు త్వరలోనే పూర్తిచేసి.. విమాన సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయానికి అవసరమైన 280 ఎకరాల భూసేకరణ చేసి అప్పగించినందున.. ఇక నుంచి పనులు మరింత వేగంగా సాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రారంభంలో చిన్న విమానాలను నడుపుతామని, ప్రజల నుంచి వచ్చే స్పందన, ప్రయాణికుల రద్దీని బట్టి భవిష్యత్తులో దూర ప్రాంతాలకు కూడా సర్వీసులను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇక తెలంగాణ రాష్ట్రానికి కీలక మౌలిక వసతి ప్రాజెక్టుగా నిలవనున్న కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు వేగవంతం అయ్యాయని తెలిపారు. అత్యాధునికంగా నిర్మిస్తున్న ఈ ఆర్‌ఎంయూ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌ఎంయూ నిర్మాణం రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేయబోతోందన్నారు. 2023లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీనికి శంకుస్థాపన చేయగా.. కేవలం మూడేళ్లలోనే ప్రధాన షెడ్‌తో సహా ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తయ్యాయని తెలిపారు. వచ్చే ఏడాదిలోనే ఈ ఫ్యాక్టరీలో పూర్తిస్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ యూనిట్‌లో ప్రాథమికంగా 16 కోచ్‌ల మెమూ ర్యాక్‌లను తయారు చేయాలని ప్రతిపాదించారు. భవిష్యత్తులో దేశీయ రైల్వే అవసరాలకు అనుగుణంగా అనేక రకాల ఆధునిక కోచ్‌లను కూడా ఇక్కడే తయారుచేస్తామని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో తయారీ రంగం బలోపేతం అవుతుందని స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక పత్తి దిగుబడి ఎంత వచ్చినా.. రైతులు పండించిన పంట మొత్తాన్ని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. దీనికోసం వ్యవసాయ శాఖ అధికారి నుంచి ఎంత దిగుబడి వచ్చిందనే అంశంపై లేఖ ఇవ్వాల్సి ఉంటుందని, తేమ శాతం గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జాతరలకు జాతీయ హోదా కల్పించడం దేశవ్యాప్తంగా ఎక్కడా అమలులో లేదని అయినప్పటికీ మేడారం జాతర నిర్వహణ కోసం అవసరమైతే నిధులు సమకూరుస్తామని హామీ ఇచ్చారు.

### ఢిల్లీ పేలుడు కేసు.. జమ్ము కశ్మీర్‌లోని

## ఎనిమిది ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు




హర్యానాలోని సిర్సాలో దారుణమైన డబుల్ మర్డర్ ఘటన చోటుచేసుకున్నది. సికందర్‌పూర్‌లో 30 ఏళ్ల రాజ్‌కుమార్ అనే వ్యక్తి తన తల్లి 47 ఏళ్ల అంగూరి దేవిని, ఆమె లవర్ 48 ఏళ్ల లేఖరాజ్‌ను హత్య చేశాడు. ఇద్దర్నీ మర్డర్ చేసి వాళ్ల మృతదేహాలను ఓ ట్రక్కులో పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి లొంగిపోయాడు. ఓ ఇంట్లో ఉన్న ఇద్దర్నీ దుపట్టాతో గొంతు నులిమినట్లు తెలుస్తోంది. హత్య చేసి మృతదేహాలను ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సదర్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తల్లిని, ఆమె లవర్‌ను చంపేశానని, తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఆ ఇద్దరి మధ్య అక్రమ సంబంధం ఉందని, వాళ్ల మృతదేహాలు తన ట్రక్కులో ఉన్నట్లు పోలీసులకు చెప్పాడతను. రాజ్‌కుమార్‌ను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు.. క్రైం సీన్‌కు మరో బృందాన్ని పంపారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ పరీక్షకు తరలించారు. లేఖరాజ్‌తో తన కూతురికి 15 ఏళ్లుగా రిలేషన్ ఉన్నట్లు అంగూరీదేవి తల్లి సుగ్రీ పోలీసులకు చెప్పింది. అయితే తమ కుటుంబాన్ని ఆ రిలేషన్ దెబ్బతీస్తున్నట్లు భర్త, కుమారుడు వార్నింగ్ ఇచ్చినా.. అంగూరి పట్టించుకోలేదు. పలు మార్లు పంచాయితీ నిర్వహించినా ఫలితం మారలేదు. భర్త పాలా రామ్ వేడుకున్నా కూడా భార్య వినిపించుకోలేదు. నిందితుడు రాజ్‌కుమార్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతను పోలీసు స్టేషన్‌కు వచ్చిన సమయంలో కూల్‌గా ఉన్నట్లు చెప్పారు. ఏమాత్రం పచ్చాతాపం ప్రదర్శించలేదు. తన తల్లి వల్ల కుటుంబం సిగ్గుతో తలదించుకున్నదని రాజ్‌కుమార్ పోలీసులకు చెప్పాడు.



## సర్పంచ్ పదవికి వేలంపాట.. రూ.73 లక్షలకు ఏకగ్రీవం

నల్గొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన 11 మంది ఆ తర్వాత గ్రామంలోని కనకదుర్గ ఆలయ నిర్మాణం, గ్రామాభివృద్ధి కోసం ఏకగ్రీవం చేయాలని నిర్ణయించి సర్పంచ్ పదవిని వేలంపాట, రూ.73 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్న మహమ్మద్ సమీనా ఖాసీం అనే అభ్యర్థి, దీనికి అంగీకరిస్తూ నామినేషన్ విత్ డ్రా చేసుకుంటామని ఒప్పంద పత్రంపై సంతకం చేసిన మిగతా అభ్యర్థులు. దీంతో బంగారిగడ్డ గ్రామ పంచాయతీ ఏకగ్రీవం.. వెలువడాల్సిన అధికారిక ప్రకటన.



### మెస్సీతో మ్యాచ్ కోసం..

## ఫుడ్‌బాల్ ప్రాక్టీస్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి!

డిసెంబర్ 13న హైదరాబాద్‌కు రానున్న స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీతో మ్యాచ్ ఆడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధం అవుతున్నారు. ఇందుకోసం ఆదివారం రాత్రి ఆయన మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో గంటపాటు ప్రాక్టీస్ చేశారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## కేరళ సీఎం పినరయి విజయన్‌కు ED నోటీసులు



కేరళ సీఎం పినరయి విజయన్‌కు బిగ్ షాక్ తగిలింది. కేఐఐఎఫ్‌బీ మసాలా బాండ్ కేసులో ఆయనతో, మాజీ ఆర్థిక మంత్రి థామస్ ఇస్సాక్, సీఎం ప్రధాన కార్యదర్శి కేఎం అబ్రహాంలకు ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) నోటీసులు జారీ చేసింది. రూ.468 కోట్ల ట్రాన్సాక్షన్స్ లో ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్మెంట్ యాక్ట్ ఉల్లంఘించారనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలని పేర్కొంది.



## తమన్నా హాట్ లుక్స్

తమన్నా భాటియా గురించి పెద్దగా పరిచయం అవసరం లేదు. శ్రీ, హ్యాపీడేస్‌లాంటి చిన్న సినిమాల్లో నటించి అందరినీ ఆకట్టుకున్నది. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే బడా హీరోలందరితో నటించి అగ్రహీరోయిన్‌గా ఎదిగింది. దశాబ్దంపైగా దక్షిణాది ప్రేక్షకులను తన అందచందాలు, అభినయంతో మెప్పించింది ఈ మిల్క్ బ్యూటీ. కొంతకాలంగా దక్షిణాదిలో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. ప్రస్తుతం పలు చిత్రాల్లో ప్రత్యేక గీతాల్లో కనిపించింది. తాజాగా తన కెరీర్‌లోనే తొలిసారిగా సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. ప్రముఖ హారర్ బోల్డ్ ఫ్రాంఛైజీ 'రాగిణి MMS' సిరీస్‌లో హీరోయిన్‌గా ఎంపికైందని సమాచారం. ఫిలీం ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్న వార్త ప్రకారం.. ఈ హారర్-థ్రిల్లర్ ప్రాజెక్ట్ కోసం 'ఏక్తా కపూర్' స్వయంగా తమన్నాను సంప్రదించారట. కథ, పాత్ర, అన్నీ విన్న తర్వాత తమన్నా ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తున్నది.




## హైడ్రా జిందాబాద్ అంటూ చిన్నారుల ర్యాలీ

మేడ్చల్ - మల్కాజగిరి జిల్లా నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లిలో పార్కులు కాపాడినందుకు గాను అక్కడి చిన్నారులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు. కాకతీయ కాలనీలో 600 గజాలు, 1500 గజాల రెండు పార్కులను కాపాడినందుకు గాను హైడ్రా కు మద్దతు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది చిన్నారులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. మాకూఆడుకునే స్థలం దొరికింది అని సంబరపడ్డారు. ప్రాణవాయువును అందించే పార్కు స్థలాన్ని కాపాడారు. అందులో మొక్కలు నాటి జాగ్రత్తగా కాపాడుకుంటామని నినదించారు. హైడ్రా వల్ల ఈ పార్కులు కాపాడుకున్నామంటూ నినదించారు.